క్లుప్తంగా

సీఎం జగన్ పాలనలోనే పల్లెల పురోగతి



గొల్లపాలెంలో వాటర్ పైపులైను నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో పట్టణాలకు దీటుగా పల్లెలు పురోగతి చెందుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు అన్నారు. గొల్లపాలెం వైఎస్సార్ నగర్‌కు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న పైపులైను నిర్మాణానికి ఆదివారం బాబూరావు తదితరులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పేదల పురోగతికి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అదే రీతిలో భారీ ఎత్తున అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి దేవి, పంచాయతీ పాలకవర్గ సభ్యుడు వెంటపల్లి శ్రీను, స్థానిక జెడ్పీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాత నాగరాజు, పలువురు స్థానిక పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న సురక్ష గ్రామ సభలు

కపిలేశ్వరపురం: గ్రామాల్లో సోమవారం నుంచి జగనన్న సురక్ష గ్రామసభలను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. 24న కపిలేశ్వరపురం-02 సచివాలయం, 25న అద్దంకివారిలంక, 26న కేదారిలంకలో గ్రామ సభలను నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.

రేపు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

కె.గంగవరం: మండలంలోని రెండు గ్రామాల్లో నేడు జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని దంగేరు, మసకపల్లి గ్రామ సచివాలయాల వద్ద ఈ క్యాంపు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. లబ్ధిదారులు ఎటువంటి ధ్రువపత్రాలు కావాలన్నా క్యాంపుల వద్ద దరఖాస్తు అందిస్తే ఒక్క రోజులోనే ఉచితంగా పత్రాలు అందిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



వెంకట రమణమూర్తి (ఫైల్)

కె.గంగవరం: మండలంలోని కుడుపూరు మాజీ సర్పంచ్ పితాని నాగేంద్ర వెంకట రమణమూర్తి (60) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఈయన 2007 నుంచి 2012 వరకు కుడుపూరు సర్పంచ్‌గా పని చేశారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో అందరి మన్ననలను పొందారు. రమణమూర్తి మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎమ్మెల్సీ నివాళి



సరిత పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ సతీమణి సరిత శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె పార్థివదేహం వద్ద పూలమాలతో ఘన నివాళులు అర్పించారు. శ్రీవరప్రకాష్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సరిత మృతి బాధాకరమని, మనోధైర్యంతో ముందుకు సాగాలని ఓదార్పునిచ్చారు.

ఉచిత వాస్క్యులర్ వైద్య శిబిరం

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో ఆదివారం ఉచిత వాస్క్యులర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్, ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ డాక్టర్ల బృందం వైద్య సేవలు అందించారు. వాస్క్యులర్ సర్జన్ జీవీ ప్రవీణ్ కుమార్, న్యూరోసర్జన్ అనిల్ కుమార్ పాల్గొని, 192 మందిని పరీక్షించారు. 167 మందికి కలర్ డాప్లర్ అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహించి, 140 మందికి లేజర్ ట్రీట్మెంట్‌తో ఆపరేషన్‌కి హైదరాబాద్ తీసుకు వెళ్లేందుకు ఎంపిక చేశారు. ఈనెల 26న ప్రత్యేక బస్సుల్లో వీరిని హైదరాబాద్ తీసుకువెళ్లి ఆరోగ్యశ్రీలో ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ హయాంలో అర్తమూరు అభివృద్ధి

మండపేట: మండలంలోని అర్తమూరు గ్రామం టీడీపీ హయాంలోనే అభివృద్ధి అయ్యిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో అర్తమూరు గ్రామంలో అభివృద్ధి జరగలేదంటూ చేసిన ఆరోపణల్లో వాస్తవంలేదన్నారు.

ఇంటి ముంగిటకు వైద్యం

- గ్రామీణ ఆరోగ్య పరిరక్షణలో విప్లవాత్మక మార్పులు
- ఫలితాలనిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- గ్రామాలకు వెళ్లి సేవలందిస్తున్న వైద్యులు



అంగరలో ఇంటికి వెళ్ళి వైద్యసేవలందిస్తున్న అంగర వైద్యాధికారి (ఫైల్)



కపిలేశ్వరపురం/రామచంద్రపురం: వైద్యో నారాయణ హరి అంటూ వైద్యుడిని దేవుడిగా కొలిచేవారు. పుస్తకాల్లోనో, ఉపన్యాసాల్లోనో వినబడే ఈ మాట నేడు గ్రామాల్లో అక్షరాలా నిరూపితమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, వైఎస్సార్ క్లినిక్‌లు గ్రామాల్లో పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సత్ఫలితాలనిస్తున్నాయి.

రోగి ఇంటికి ప్రభుత్వ వైద్యం

అనారోగ్యంతో అవస్థ పడుతున్న రోగి ఇంటి వద్దకే వైద్యాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ రూపొందించింది. గతేడాది చివరలో ట్రయల్ రన్‌గా ప్రారంభమైన ఈ విధానం రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 15 పీహెచ్‌సీల పరిధిలో మంచి ఫలితాలనిచ్చింది. కె.గంగవరం మండలంలోని శేరిలంక పీహెచ్‌సీ పరిధిలో ఒకే ఒక్క గ్రామం ఉండడం, అక్కడ పీహెచ్‌సీ సేవలందుతుండడంతో కాన్సెప్ట్ నుంచి మినహాయించారు. మిగిలిన 15 పీహెచ్‌సీల్లోని 117 గ్రామాలకు వైద్యులు, సిబ్బంది ఇంటికి వెళ్లి వైద్యం చేస్తున్నారు. 104, పీహెచ్‌సీల వైద్యులు, అధికారులు, ఉద్యోగులు, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలంతా సేవా దృక్పథంతో క్షేత్ర స్థాయిలో వైద్యసేవలందిస్తున్నారు. నిర్దేశించుకున్న షెడ్యూలు ప్రకారం నెలలో రెండు రోజులు 104 వాహనంలో వైద్య సిబ్బంది గ్రామనికి వెళ్లి సేవలందిస్తారు. బీపీ, షుగరు, టీబీ తదితర 14 రకాల పరీక్షలు చేసే సాంకేతికతతో 104 వాహనాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఆధునీకరించింది. 67 రకాల మందులను ఉచితంగా అందజేసేందుకు సిద్ధం చేశారు. పరీక్షల రిపోర్టు ఆధారంగా ఇంటి వద్దనే వైద్యుడు రోగికి తన ఆరోగ్య పరిస్థితిని వివరించి ధైర్యం చెప్తున్నారు.

మండపేట నియోజకవర్గంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలిలా..

పీహెచ్‌సీ	జనాభా ప్రాతినిధ్యం	గ్రామాలు
అంగర	20,175	04
అచ్యుతాపురం	17,109	08
వాకతిప్ప	17,908	04
ద్వారపూడి	44,904	06
కేశవరం	22,784	06
మాచవరం	19,000	06

విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు ఇలా...

పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం గ్రామాల్లోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. వాటికి పక్కా భవనాలను సమకూర్చేందుకు నిధులను సైతం కేటాయించింది. ఒక్కో భవనానికి రూ.17.50 లక్షలు మంజూరు చేయగా అవి యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నారు. నియోజకవర్గంలోని మండపేటలో 13, రాయవరంలో 6, కపిలేశ్వరపురంలో 11 మొత్తం 30 వెల్‌నెస్ కేంద్రాలు మంజూరయ్యాయి. వాటిలో కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రిక కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. మాచర, వడ్లమూరు కేంద్రాలు దాదాపు పూర్తి కావచ్చాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. మండపేట రూరల్ మండలం అర్తమూరులో వెల్‌నెస్ కేంద్రం పూర్తయింది. రాయవరం పీహెచ్‌సీ పరిధిలో ఏడు హెల్త్ క్లినిక్‌లుండగా రోజుకు సుమారు 40 మందికి సేవలందిస్తున్నారు. మాచవరం పీహెచ్‌సీ పరిధిలోని 10 హెల్త్ క్లినిక్‌లలో రోజుకు 45 మందిని పరీక్షిస్తున్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో రోజుకు 20 మందికి టెలి కన్సల్టేషన్ సేవలందిస్తున్నారు.

రామచంద్రపురం నియోజకవర్గంలో వివరాలు..

మండలం	పీహెచ్‌సీలు	విలేజ్ క్లినిక్ సెంటర్లు	ఇప్పటివరకు ఓపీ
కె.గంగవరం	4	18	32845
రామచంద్రపురం	2	18	28334
కాజులూరు	2	17	29455

పర్యవేక్షణకు పెద్దపీట

ప్రజా వైద్య, ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం విలేజ్ టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఈ ఏడాది మార్చి 28వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. సచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ పనిచేస్తోంది. బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), మిడ్‌లెవెల్ ప్రొవైడర్ ప్రతి గ్రామంలో టాస్క్ ఫోర్స్ కమిటీ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఆశ, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు ఒక్కొక్కరు చొప్పున, స్కూల్ హెల్త్ అంబాసిడర్, డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు కమిటీలో సభ్యులుగా ఉంటారు. వారంతా వైద్య, ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

అలాగే రామచంద్రపురం నియోజకవర్గంలో నియోజకవర్గంలో మూడు మండలాలైన కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల్లో 53 విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. కాజులూరు మండలంలోని గొల్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో 10, దుగ్గుదూరు పీహెచ్‌సీలో 7, రామచంద్రపురం మండలంలోని వెల్ల పీహెచ్‌సీ పరిధిలో 8, ద్రాక్షారామ పీహెచ్‌సీలో 10 విలేజ్ క్లినిక్‌లున్నాయి. కె.గంగవరం మండలంలోని పేకేరు, దంగేరు, కుందూరు, పామర్రు పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 18 విలేజ్ క్లినిక్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతి విలేజ్ క్లినిక్‌లో రోజూ 25 నుంచి 40 మంది వరకు వైద్యసేవలను పొందుతున్నారు. ఇలా రోజూ మొత్తం 53 విలేజ్ క్లినిక్‌ల ద్వారా 1600 మందికి పైగా ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారు. వృద్ధులకు బీపీ, సుగర్ వంటి వ్యాధులకు నెలవారీ మందులను ఉచితంగా అందజేస్తున్నారు. రామచంద్రపురం పట్టణంలో ఇప్పటికే ఏరియా ఆసుపత్రి, ఒక అర్బన్ హెల్త్ సెంటర్ ఉండగా ముచ్చుమిల్లిలో ప్రత్యేకంగా ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌ను నెలకొల్పి శివారు ప్రాంతాల ప్రజలకు వైద్యాన్ని అతి చేరువకు తీసుకువచ్చారు. ఈ హెల్త్ సెంటర్ ద్వారా ప్రతి రోజు 30 నుంచి 50 మంది వరకు రోగులు వైద్య సేవలను పొందుతున్నారు.

45 క్లినిక్ సెంటర్లకు రూ.11.25 కోట్ల నిధులు మంజూరు

నియోజకవర్గంలో 45 విలేజ్ క్లినిక్‌ల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసింది. ఒక్కో విజేల్ క్లినిక్ నిర్మాణానికి రూ.25 లక్షల చొప్పున మొత్తం 45 విలేజ్ క్లినిక్‌లను మొత్తం రూ.11. 25 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గ్రామాల్లో ఇప్పటికే విలేజ్ క్లినిక్‌లు నిర్మాణ దశలో ఉన్నాయి.

ఇంటికొచ్చి సేవలందించడం అద్భుతం



ప్రభుత్వాసుపత్రి డాక్టర్ రోగి ఇంటికి వచ్చి చికిత్స చేయడం అద్భుతమైనది. అంగర పీహెచ్‌సీ డాక్టర్ గారు నా ఇంటికి వచ్చి సేవా దృక్పథంతో వైద్యసేవలందిస్తున్నారు. వయస్సు పైబడటంతో బయటకు వెళ్ళలేని నాలాంటి వారికి ఈ సదుపాయం ఎంతగానో ఉపకరిస్తుంది.

– పలివెల అబ్రహం, కపిలేశ్వరపురం

వైద్యం అందిస్తున్న తీరు భిన్నంగా ఉంది



గతంలో సుస్తి చేస్తే అంగర పీహెచ్‌సీకి మారుమూల గ్రామమైన తాతపూడి నుంచి వెళ్ళాల్సి వచ్చేది. మారుమూల గ్రామం కావడంతో ఇతర ప్రైవేటు ఆసుపత్రులు లేవు. తాతపూడిలోని అత్తమ్మ సీతాకుమారిని అంగర డాక్టరు గారు ఇంటికొచ్చి పరీక్షిస్తున్నారు. ప్రయాసపడి ఆసుపత్రి వరకూ వెళ్ళనక్కర్లేకుండా ఇంటికే వచ్చి వైద్యసేవలందించడం ఎంతో సౌకర్యంగా ఉంది.

– జిత్తుక సరిత, తాతపూడి, కపిలేశ్వరపురం మండలం

అందుబాటులోకి నాణ్యమైన వైద్యం



గతంలో గ్రామాల నుంచి ఆసుపత్రికి మైళ్ల దూరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ బాధలు గట్టెక్కాయి. ఆసుపత్రులకు అనుగుణంగా గ్రామాల్లో అన్ని సౌకర్యాలతో విలేజ్ క్లినిక్‌లను తీసుకురావటం మూలంగా ఏళ్ల తరబడి బీపీ, సుగర్ వంటి ఇతర దీర్ఘలిక వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేకూరింది. బీపీ, సుగర్ వంటి పరీక్షలు విలేజ్ క్లినిక్‌లకు వెళ్లి ఉదయాన్నే చూపించుకునే వెసులు బాటు కలిగింది. విలేజ్ క్లినిక్‌లు ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి.

– పట్నాల శ్రీదేవి, అముజూరు, కె.గంగవరం మండలం

సప్తగోదావరికి శుద్ధ జలాల విడుదల



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్తగోదావరిలోకి శుద్ధ జలాలు విడుదల చేసి హారతి ఇచ్చి పూలు జల్లుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా, పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ఆధునీకరించిన సప్త గోదావరిలోకి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ చేతుల మీదుగా ఆదివారం వేద మంత్రోచ్చారణల నడుమ శుద్ధ జలాలు విడుదల చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సప్తగోదావరిలో జలాలు స్వామి వారి అభిషేకానికి, భక్తులు స్నానాలాచరించడానికి అనుకూలంగా లేకపోవడంతో మంత్రి వేణు సప్తగోదావరి ఆధునీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. మంత్రి వేణు కృషితో సప్తగోదావరిలోని మూడు స్నాన ఘట్టాలను పూర్తిగా కాంక్రీట్ వేయించారు. జలాలు నాచుపట్టకుండా ఇసుక వేయించారు. దీనితో భీమేశ్వరస్వామి తొలి అభిషేకానికి, భక్తులు స్నానాలాచరించడానికి ఇకపై ఎటువంటి అసౌకర్యం ఉండదని గ్రామస్తులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, రాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీ హోమందారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు కోతను నివారించాలి



నామవానిపాలెం జంక్షన్ వద్ద ప్రమాదభరితంగా ఉన్న పల్లిపాలెం రహదారి

కాజులూరు: మండలంలోని కోలంక, పల్లిపాలెం రహదారిలో పలుచోట్ల రోడ్డు కాలువకోతకు గురై బెర్మ్‌లు కరిగిపోవటంతో ప్రయాణికులు నానాఅవస్థలు పడుతున్నారు. ఈ రెండు గ్రామాల మధ్య సుమారు మూడు కిలో మీటర్ల పొడవున్న రహదారి పలుచోట్ల రోడ్డు కాలువ కోతకు గురై అప్రోచ్ కరిగిపోగా పలుచోట్ల గోతులు ఏర్పడి శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డు నిర్మాణానికి గత ఏడాది క్రితం రూ.70 లక్షల నిధులు మంజూరవగా అభివృద్ధి పనులు చేపట్టిన జిల్లా పరిషత్ ఇంజినీరింగ్ అధికారులు కేవలం రోడ్డు మాత్రమే వేసి అప్రోచ్‌లు పట్టించుకోలేదు. భారీ వాహనాలు ఎదురుగా వచ్చే సమయంలో సైకిల్, బైక్ వంటి వాహనాలు తప్పించుకు వెళ్లబోయి సరాసరి కాలువలోకి పల్టీలు కొడుతూ ప్రమాదాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెంకన్న నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన పి.నాగవెంకట మహేష్, హరిణి దంపతులు రూ.11,116, రాజమహేంద్రవరానికి చెందిన ఎం.సందీప్-శాంతి దంపతులు రూ.10,116, కోరుమిల్లికి చెందిన ఎస్.రామారావు-లక్ష్మీపార్వతి దంపతులు రూ.10,116, యనమలకుదురుకి చెందిన డి.రామకిషోర్-రుక్మిణీ దంపతులు రూ.10,116, నర్సీపట్నానికి చెందిన జె.వెంకటరాజ్‌కుమార్-రమ్య దంపతులు రూ.10,116, ఉల్లంపర్రుకు చెందిన ఎం.రఘురాంబాబు-భాగ్యలక్ష్మి రూ.10 వేలు విరాళం అందించినట్లు ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

నిలకడగా వరద



కేదారిలంక వద్ద ప్రవహిస్తున్న గోదావరి వరద

కపిలేశ్వరపురం: గోదావరి వరద నిలకడగా ఉంది. ఎగువలో వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల శివారులో వరదనీరు నిలకడగా ఉంది. ఇటుక బట్టీలు ముంపులోనే కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు పర్యవేక్షణలో కేదారిలంకలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. అద్దంకివారిలంక, పల్లపులంక, వీధివారిలంక, నారాయణలంక గ్రామాల్లో అధికారులు వరద పరిస్థితిని సమీక్షించారు.

వాహనాలకు నేడు వేలం

ఆలమూరు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ వద్ద వివిధ వాహనాలకు సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ సీహెచ్ అరుణమ్మ తెలిపారు. వాహనాల వేలంలో పాల్గొనేవారు హాజరు కావాలని ఆమె కోరారు.

పుడమి తల్లికి పచ్చ బొట్లు

- నియోజకవర్గంలో వేగంగా వరినాట్లు
- విస్తారంగా వర్షాలు
- వరినాట్లు ముమ్మరం



కె.గంగవరంలో కనుచూపు మేర వరినాట్ల పచ్చదనంతో పంట పొలాలు

కె.గంగవరం: నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురవడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు వర్షాలు అంతంత మాత్రం పడినా రైతులను మాత్రం నిరాశ పరిచింది. అయితే గత వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తొలకరి పనులను రైతులు ముమ్మరం చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటి వరకు 30 శాతం నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. శుక్రవారం నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి చెరువులు, కాలువలు, పంట బోదెలు, ఊటకాలువలు వర్షపు నీటితో నిండిపోయాయి. కోటిపల్లిలోని ప్రధాన కాలువ, కె.గంగవరంలోని టేకి డ్రైన్, పామర్రులోని రాజు కాలువలు నీటి ప్రవాహంతో కళకళలాడుతూ ప్రవహిస్తున్నాయి. వర్షాలు పూర్తి స్థాయిలో కురవడం వల్ల నాట్లు పెరిగి పుడిమి తల్లికి పచ్చబొట్లు వేసినట్టుగా ఆహ్లాదంగా మారాయి. కాలువలకు నీరు రావడం, వర్షాలు ప్రారంభం కావడంతో వరినాట్లు మరింత ఊపందుకున్నాయి. ఈ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎండ తాకిడితో వరినాట్లు ఆలస్యమయ్యాయి. ఈ నెల మొదట్లో కాలువకు నీరు వచ్చినా వర్షం లేకపోవడంతో సాగు కొంత మేర ఆలస్యమయింది. దీంతో కేవలం రైతులు నారుమడులు వేయడంతోనే సరిపుచ్చుకున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో కె.గంగవరం మండలంలో 4200 హెక్టార్లు, కాజులూరులో 4500 హెక్టార్లు, రామచంద్రపురం మండలంలో 5046 హెక్టార్లలో వరిసాగు చేస్తున్నారు.

బెంగాలీ కూలీలతోనే..

వర్షాలు అధికంగా కురుస్తుండడంతో రైతులు అందరూ ఒక్కసారిగా నాట్లు వేయడానికి సిద్ధం అవుతున్నారు. వీరంతా ఎక్కువగా బెంగాలీ కూలీలపైనే ఆధార పడుతున్నారు. నాట్లు వేయడానికి ఖర్చు తక్కువగా అవడం, వేగంగా నాట్లు వేయడం పాటు ఎకరానికి ఉపయోగించే నారు తక్కువగా ఉండడంతో రైతులు ఎక్కువ భాగంగా బెంగాలీ కూలీలపై ఆధారపడుతున్నారు. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా అధిక దిగుబడులు నిచ్చే వరి వంగడాలైన ఎంటీయూ 1318, ఎంటీయూ 7029 రకాల సాగుపై మక్కువ చూపిస్తున్నారు. మరో 20 రోజుల్లో వరి నాట్లు పూర్తి కావచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వేగంగా వరి నాట్లు పూర్తి చేసుకోవాలని రైతులు కూడా వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు.

వేగంగా వరినాట్లు పూర్తి చేయాలి



వర్షాలు అధికంగా కురుస్తున్నాయి. ఇలాంటి తరుణంలో రైతులు వరినాట్లు వేగంగా పూర్తి చేస్తే దిగుబడి అధికంగా ఉంటుంది. ఇప్పటికే ఈ సీజన్ కొంత వరకు ఆలస్యమయింది. ప్రభుత్వం కూడా రైతు భరోసా ద్వారా కొంత మేర సొమ్మును ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ఆ సొమ్ములను ఉపయోగించేకుని నాట్లు పూర్తి చేయాలి.

– బలుసు రవి, వ్యవసాయాధికారి, కె.గంగవరం



తామరపల్లిలో దమ్ము చేస్తున్న రైతు



పామర్రులో వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



నాట్లు వేస్తున్న కూలీలు

రాయవరం: అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడంతో వరినాట్ల జోరు ఊపందుకుంది. వర్షం నీరు పొలాల్లో చేరడంతో దమ్ములు చేసి, నాట్లు వేసే పనిలో రైతన్న బిజీ అయిపోయాడు. పొలాల్లో ఎటు చూసిన వరి నారు తీత, నాట్లు వేసే పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వరి చేలు ఏపుగా ఎదిగి మంచి దిగుబడి ఇవ్వాలని వరుణదేవుడ్ని రైతన్న కోరుకుంటూ హుషారుగా ముందుకు సాగుతున్నాడు.



ట్రాక్టర్లతో దుక్కి దున్నే పనిలో..



పొలం చదునుకు పట్టి తోలుతూ..